క్లుప్తంగా

ఆయకట్టు కోతలు ప్రారంభం



ఖానాపురం : ధాన్యాగార కేంద్రమైన పాకాల ఆయకట్టు కింద యాసంగిలో పూర్తిస్థాయిలో వరిపంట సాగు చేశారు. ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి గోదావరి జలాల తరలింపు ప్రక్రియ చేపట్టడంతో చెరువుల్లోకి గోదావరి జలాలు పుష్కలంగా వచ్చాయి. దీంతో ఆయకట్టు కింద 1,8000 ఎకరాల్లో వరి సాగు కావడంతో రైతులు సంతోషపడ్డారు. కానీ రైతుల ఆశలపై వర్షం నీళ్లు చల్లడంతో భారీగా పంటలు దెబ్బతిన్నాయి. మిగిలిపోయిన పంటలను రైతులు కాపాడుకున్నారు. ఆయకట్టు పరిధిలో కోతలను ప్రారంభించుకున్నారు. చైన్‌మిషన్‌ల ద్వారా గంటకు రూ.3,500లతో కోతలు ప్రారంభించారు.

వేములవాడకు ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీస్

నెక్కొండ : మండల ప్రజల కోరిక మేరకు నెక్కొండ మండలం నుంచి వేములవాడ పుణ్యక్షేత్రానికి ఎక్స్‌ప్రెస్ బస్ సర్వీస్ నడుపనున్నట్లు మహబూబాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ జలగం విజయ్ శనివారం ప్రకటనలో తెలిపారు. రేపటి(సోమవారం) నుంచి మహబూబాబాద్, కేసముద్రం వయా నాగారం, గుండెంగ, నెక్కొండ మీదుగా వేములవాడకు బస్ సర్వీస్ ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.20 గంటలకు డిపో నుంచి బయలుదేరుతుందని, 9.35 గంటలకు కేసముద్రం, 10గంటలకు నెక్కొండకు చేరుకుంటుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల సౌకర్యార్థం ప్రారంభిస్తున్న బస్ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జేపీఎస్‌ల శ్రమదానం

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శనివారం శ్రమదానం నిర్వహించారు. డివిజన్ వ్యాప్తంగా జేపీఎస్‌లు, ఓపీఎస్‌లు చేస్తున్న సమ్మె శనివారం నాటికి 9వ రోజుకు చేరుకోగా, సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శ్రమదానం కార్యక్రమం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మధు, రాజ్‌కుమార్, రాంబాబు, విష్ణు, శంషోద్దీన్, శివ, అజయ అల్లావుద్దీన్, రాజు, వికాస్, శ్రావణ్, ఆనంద్, రమ్య, వాణి, మాలతి పాల్గొన్నారు.

కారోబార్ల సంఘం సంఘీభావం



సంగెం : జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు మండల కారోబార్ల సంఘం శనివారం సంఘీభావం తెలియజేశారు. ఈ సందర్భంగా కారోబార్ల మండల అధ్యక్షుడు దొనికెల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇన్‌చార్జ్ కార్యదర్శుల వల్ల గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోందన్నారు. కార్యక్రమంలో కారోబార్లు సుమన్, రాజమౌళి, రవి, వెంకట్రావు, రాజు, యాకూబ్ తదితరులు పాల్గొన్నారు.

గీతకార్మికుడికి తీవ్రగాయాలు



చికిత్స పొందుతున్న చిర్ర వెంకన్న

రాయపర్తి : ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి తీవ్రగాయాలైన సంఘటన శనివారం మండలంలోని గట్టికల్ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గట్టికల్ గ్రామానికి చెందిన చిర్ర వెంకన్న వృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు మోకుజారి పడడంతో తీవ్రగాయాలయ్యాయి. కాగా వెంకన్నను చికిత్స నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు తెలిపారు.

ఉచిత వైద్యశిబిరం

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రయాణ ప్రాంగణంలో శనివారం అపోలో రీచ్ ఎస్ఎస్ఆర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ కందగట్ల రవి ప్రారంభించారు. కాగా శిబిరంలో 250మందికి బీపీ, షుగర్ పరీక్షలను డాక్టర్లు విజయ్, నిహారికలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. స్టాఫ్ నర్సు సంకీర్తన, అమూల్య, సుజన్, పీఆర్వో మహేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

8న నిరుద్యోగ సంఘర్షణ సభ

పరకాల : ఈ నెల 8న హైదరాబాద్‌లో నిర్వహించనున్న నిరుద్యోగ సంఘర్షణ సభను విజయవంతం చేయాలని ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ అర్షం అశోక్ పిలుపునిచ్చారు. పరకాలలో జరిగిన కాంగ్రెస్ పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశానికి పట్టణ అధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్ అధ్యక్షతన వహించగా ముఖ్యఅతిథిగా అశోక్ హాజరై మాట్లాడారు. నిరుద్యోగ సంఘర్షణ సభకు ఏఐసీసీ జాతీయ నాయకురాలు ప్రియాంక గాంధీ హాజరుకానున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దె దించడమే లక్ష్యంగా పోరాటాలు చేసినప్పుడే దేశాభివృద్ధి, ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. నిరుద్యోగ యువకులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు.

అన్నదాతలు అధైర్యపడొద్దు



వర్ధన్నపేట: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అరూరి, మార్నేని



చెన్నారావుపేట: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

- పంట నష్టం వివరాలు అందించాలి
- నేటితో చివరి అవకాశం
- ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

చెన్నారావుపేట : అన్నదాతలను సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఆదుకుంటుందని, అధైర్యపడొద్దని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలోని సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం, మొక్కజొన్నల కొనుగోలు కేంద్రాలను సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణరెడ్డి అధ్యక్షతన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. రైతులకు పెట్టుబడికి రూ.10 వేలు, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలకు నష్టం కలిగితే ఎకరాకు రూ.10 వేల నష్ట పరిహారం అందించే తొలి రాష్ట్రం తెలంగాణ అన్నారు. పంటలు నష్టపోయిన రైతులు వివరాలను ఏఈఓలకు అందించాలన్నారు. నష్టపరిహారం డబ్బులు కలెక్టర్‌లకు చేరుకున్నాయని, త్వరలో చెక్కులు లేదా ఆన్‌లైన్ ద్వారా అందించడం జరుగుతుందన్నారు. ధాన్యానికి ఏ గ్రేడ్‌కు రూ.2,060, కామన్ రకానికి రూ.2,040, మొక్కజొన్నలకు రూ.1,962 నిర్ణయించినట్లు చెప్పారు. కార్యక్రమంలో డీసీఓ సంజీవరెడ్డి, డీజీఓ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు, ఎంపీపీ బాదావత్ విజేందర్, జెడ్పీటీసీ బానోత్ పత్తినాయక్, వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి, మహ్మద్ రఫి, బుర్ర తిరుపతి, తూటి శ్రీనివాస్, మురహరి రవి, గఫ్ఫార్, తొగరు చెన్నారెడ్డి, కంది కృష్ణచైతన్యరెడ్డి, కందకట్ల సాంబయ్య, స్వామి, స్మిత, చిట్టి రవి, డైరెక్టర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, రైతులు ఉన్నారు.

ఖానాపురం : అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన వివరాలు నమోదు చేసుకోని రైతులు ఆదివారం లోపు వ్యవసాయ అధికారులకు వివరాలు అందించాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు మండలంలోని రంగాపురం గ్రామంలో హనుమాన్ రైతు పరపతి, మార్కెటింగ్ పరస్పర సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే పెద్ది మాట్లాడారు. ఎఫ్‌పీఓ, మాక్స్ సొసైటీల ఏర్పాటు రైతులకు శ్రేయస్కరమన్నారు. ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు, ఆర్‌బీఎస్ కన్వీనర్ వెంకట్‌రెడ్డి, సంఘం అధ్యక్షుడు బందారపు శ్రీనివాస్, సర్పంచ్‌లు ఐలయ్య, నరేష్, నాయకులు నాగార్జున్‌రెడ్డి, భూస అశోక్‌యాదవ్, గోనె యువరాజు, బలరాం,బాబురావు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే రమేష్

వర్ధన్నపేట : రైతులకు అండగా ఉంటామని వారికి ఎలాంటి కష్టాలు రాకుండా ఉండడానికి తమ ప్రభుత్వం కృషి చేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. శనివారం మండలంలోని ఇల్లంద వ్యవసాయ మార్కెట్ యార్డులో వర్ధన్నపేట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మక్కల కొనుగోలు కేంద్రాన్ని రమేష్, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావుతో కలిసి ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కమ్మగోని స్వామిరాయుడు, పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేష్‌ఖన్నా, సర్పంచ్ సుంకరి సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

'మాయావతి తన వైఖరి స్పష్టం చేయాలి'



దీక్ష వద్ద మాట్లాడుతున్న కల్లెపల్లి ప్రణయ్‌దీప్

నర్సంపేట : ఎస్సీ వర్గీకరణపై బీఎస్పీ అధినేత్రి మాయావతి తన వైఖరిని స్పష్టం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కల్లెపల్లి ప్రణయ్‌దీప్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని అమరవీరుల స్తూపం వద్ద శనివారం నిరసన ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 7వ తేదీన హైదరాబాద్‌లో నిర్వహించే తెలంగాణ భరోసా సభకు వస్తున్న మాయావతి ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ పట్ల తన స్పష్టమైన వైఖరి తెలియజేయాలని కోరారు. ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్ విధానంలో ఎస్సీలలోని మెజార్టీ జనాభా కలిగి ఉన్న కులాలకు అన్యాయం జరుగుతుంటే సామాజిక న్యాయమైన ఎస్సీ రిజర్వేషన్ డిమాండ్ పట్ల బహుజనుల పార్టీ అని చెప్పుకునే బీఎస్పీ వర్గీకరణపై తమ వైఖరి తెలియజేయకపోవడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో బాబు రాజుయాదవ్, మునిగె యాకోబు, శ్రీకాంత్, విజయ్, శ్రీనివాసచారి, మాతంగి బాబు, రాజు, శ్రీకాంత్, రవి, ప్రవీణ్, పవన్, లావణ్య, సరోజన, అనిత, లక్ష్మి, కవిత, సునీత పాల్గొన్నారు.

కొనసాగుతున్న నిరసన దీక్ష

దళిత బంధు పథకంలో అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేల పేర్లను వెల్లడించాలని చేపట్టిన నిరసన మహాదీక్ష శనివారం రెండో రోజుకు చేరుకుంది. ఈ మేరకు మహాజన సోషలిస్టు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కల్లెపల్లి ప్రణయ్‌దీప్, కో కన్వీనర్ తడుగుల విజయ్‌లు మాట్లాడారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ

దామెర : నిరంతరం విద్యుత్ సరఫరా చేయడానికి ప్రతి ఉద్యోగి కృషి చేయాలని విద్యుత్ డీఈ సామ్య నాయక్ అన్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా పరకాల సబ్ డివిజన్ ఉద్యోగులతో శనివారం సమీక్ష నిర్వహించారు. సమావేశంలో భాగంగా గ్రామాల వారిగా ప్రగతి నివేదికను అడిగి తెలుసుకున్నారు. భద్రత చర్యలు తెలిపే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించిన అనంతరం ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రతి ఉద్యోగి పనిచేయాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వినియోగదారులకు సేవలందించాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. సమావేశంలో పరకాల ఏడీఈ జె.దేవేందర్ నాయక్, ఏఈలు గుర్రం రమేష్, సత్యనారాయణ, రవికుమార్,రాజ్‌కుమార్, విశ్వప్రసాద్, విద్యుత్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

నర్సంపేట : నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత సోషల్ మీడియా వారియర్స్‌దేనని ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని పద్మశాలి గార్డెన్‌లో శనివారం నియోజకవర్గ యూత్, సోషల్ మీడియా వారియర్స్‌కు రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ సతీష్‌రెడ్డి ఆధ్వర్యంలో పొలిటికల్ ప్రమోషన్స్, సోషల్ మీడియా యూసేజ్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పక్షాలు తప్పుడు వార్తల క్రియేషన్స్ ద్వారా ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వాన్ని అభాసు పాలు చేస్తున్నారన్నారు. తప్పుడు మేసేజ్‌లతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. సరైన విషయ పరిజ్ఞానంతో ప్రతిపక్షాల కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. మనం చేరవేసే అంశాన్ని ఎక్కువ మందికి చేరేందుకు టెక్నికల్ స్కిల్స్ అవసరం అన్నారు. నర్సంపేట ప్రాంత అభివృద్ధిలో ఉత్సాహవంతమైన యువత, సోషల్ మీడియా వారియర్స్ పాలు పంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు ఊడ్గుల ప్రవీణ్, సుకినె రాజేశ్వర్‌రావు, నామాల సత్యనారాయణ, శానబోయిన రాజ్‌కుమార్, నాయకులు రాయిడి దుశ్యంత్‌రెడ్డి, కృష్ణచైతన్య, కౌన్సిలర్లు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో చేరికలు

అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. శనివారం చెన్నారావుపేట మండలం ఎల్లాయిగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పార్టీలో చేరగా వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

హనుమాన్ శోభాయాత్ర

ఐనవోలు : మండల కేంద్రంలో హనుమాన్ శోభాయాత్రను భక్తులు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ దీక్ష స్వీకరించిన భక్తుల శోభాయాత్రను సర్పంచ్ జన్ను కుమారస్వామి, ఉప సర్పంచ్ అడ్డగూడి సతీష్ ప్రారంభించారు. గురుస్వామి వలుగుల రాజేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన శోభాయాత్ర ప్రఖ్యాత ఐనవోలు శ్రీమల్లికార్జునస్వామి ఆలయం నుంచి హనుమాన్ దేవాలయం వరకు కొనసాగింది. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ వడిచర్ల శ్రీనివాస్, హనుమాన్ స్వాములు పులి సాగర్, వెంకటస్వామి, మల్లయ్య, కుమారస్వామి, శ్రీను, రఘు, విశ్వాస్, రాజు, బాలరాజు, కుమార్ ఇతర స్వాములు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనరసింహస్వామికి పుష్పయాగం

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పంచమ వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి, శనివారం ఉదయం మహా పూర్ణాహుతి, ఉత్సవ మూర్తులు లక్ష్మీనరసింహుడు, పద్మావతి, ఆలమేలు మంగ శ్రీవేంకటేశ్వరుడికి పంచామృతాలతో అభిషేకం అర్చకులు ఘనంగా జరిపించారు. అనంతరం చక్రస్నానం, అవభృదోత్సవం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కాగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ వేముల నాగరాజు, పూర్ణచందర్ వారి తల్లిదండ్రుల పేర మహా అన్నదానం చేశారు. సాయంత్రం నాగవెల్లి, ద్వాదశారాధనలు, శ్రీ పుష్పయాగం, ద్వాదశ ఆవరణ సేవలు విశేషంగా నిర్వహించారు. ధ్వజపట ఉద్వాసన, ఋత్విక్ సన్మానం చేసిన అనంతరం స్వామి అమ్మవార్లకు పవళింపు సేవ, పుష్పోత్సవం, ఏకాంత సేవ చేశారు. భక్తులకు తీర్థం, 12 రకాల ప్రసాదాలు అందజేయడంతో బ్రహ్మోత్సవ కార్యక్రమాలు పూర్తయ్యాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరై పంచామృతాలు, పూలు సమర్పించి కార్యక్రమాలు తిలకించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ, కమిటీ సభ్యులు తాడెం మోహన్, నిమ్మాని వేంకటేశ్వర్‌రావు, కాటబోయిన కుమారస్వామి, వకుళ, సర్పంచ్ కంజర్ల రమేష్, ఎంపీటీసీ తాటికాయల రమేష్, ఉప సర్పంచ్ ప్రకాశ్, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన హ్యాండ్‌బాల్ శిక్షణ



రాయపర్తి : మండలకేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల,కళాశాలలో నిర్వహిస్తున్న హ్యాండ్‌బాల్ శిక్షణ ముగిసినట్లు జేఎల్ అనిత తెలిపారు. శనివారం కళాశాలలో ముగింపు సమావేశం నిర్వహించామన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా అవగాహన కల్పించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పీడీ కళమ్మ, పీఈటీ హేమ, హెచ్ఎస్ రమాదేవి, కోచ్ మీనా తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



సంగెం: సాయం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు



రాయపర్తి: నగదు అందిస్తున్న యూత్ సభ్యులు

వర్ధన్నపేట: మండలంలోని ఇల్లందకు చెందిన సాతుపెల్లి ఉప్పస్వామి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని ఎమ్మెల్యే రమేశ్ పరామర్శించి, సాయం అందజేశారు. అదే విధంగా వర్ధన్నపేటకు చెందిన దొమ్మటి రాజన్నకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2.5 లక్షలు ఎల్‌ఓసీ, ఇల్లంద గ్రామానికి చెందిన తూల్ల బుచ్చయ్య వైద్య చికిత్స కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన రూ.లక్ష చెక్కును అందజేశారు. చైర్మన్ కమ్మగోని స్వామిరాయుడు, పీఏసీఎస్ చైర్మన్ కొడగాని రాజేష్‌ఖన్నా, సర్పంచ్ సుంకరి సాంబయ్య పాల్గొన్నారు.

పరామర్శ

వరంగల్ (పర్వతగిరి): మండల కేంద్రానికి చెందిన రహమాన్ స్నేహితుడి వివాహానికి వెళ్లగా ములుగు జిల్లా నుంగూరువెంకటాపూర్ మండలం అంకన్నగూడెం వద్ద గోదావరిలో ఈతకు వెళ్లి శుక్రవారం మృతిచెందాడు. కాగా సర్పంచ్ చింతపట్ల మాలతి శనివారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు.

ఆర్థికసాయం

సంగెం : మండలంలోని చింతలపల్లికి చెందిన బాధిత కుటుంబానికి ఇనగాల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన వాటర్‌మన్ దుబ్బ రఘు కుటుంబానికి రూ.5 వేలు శనివారం పార్టీ మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి అందజేశారు. సర్పంచ్ ఇండ్ల రవికుమార్, ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, ఉప సర్పంచ్ బండి రాధిక, మెట్టుపల్లి రమేష్, ఆగపాటి రాజు, తీగల రాజేష్ గౌడ్, నాయకులు కుందారపు శ్రీను, రబ్బాని, కృష్ణ, పాష పాల్గొన్నారు.

రాయపర్తిలో..

రాయపర్తి : మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన అరూరి చంద్రశేఖర్ ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందగా శనివారం అంబేడ్కర్ సంఘం నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులకు రూ.5వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ సంఘం నాయకులు గారె కిరణ్, బిర్రు కుమార్, గారె శుభాకర్, బందు రాజు, నక్క శేఖర్, గారె రమేష్, తాటికాయల సైదులు, గారె రాజు, గారె సందీప్, ఐత రాజు, గారె సతీష్, నల్ల ప్రశాంత్, గద్దల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజలకు కేసీఆరే బలం

పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

సంగెం : తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆరే బలమని పేదలకు అనేక సంక్షేమ పథకాలతో అన్ని విధాలా ఆదుకుంటున్న ఘనత ఆయనకే దక్కుతుందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మొండ్రాయి, నార్లవాయి గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు హనుమకొండలోని తన నివాసంలో ఇళ్ల స్థల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని ఇళ్లు నిర్మించిన పేదలకు ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరణ చేసి పట్టాలు ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. క్రమబద్ధీకరణ గడువును మరో నెల రోజులు పెంచారని ఇంకా అర్హులుంటే సద్వినియోగం చేసుకోవాలి. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుదర్శన్ రెడ్డి, సర్పంచ్‌లు మెరుగు మల్లేశం, మామిడాల సుదర్శన్, నాయకులు కొనకటి మొగిలి, కోడూరి రమేష్, మన్సూర్ అలీ, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీలను విజయవంతం చేయాలి



వర్ధన్నపేట: సమీక్ష నిర్వహిస్తున్న అప్పారావు



ఖానాపురం: మాట్లాడుతున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

వర్ధన్నపేట : ఈ నెల 15, 16, 17తేదీల్లో నిర్వహించే సీఎం కప్–2023 మండల స్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఎంపీపీ అన్నమనేని అప్పారావు అన్నారు. శనివారం ఎంపీపీ చాంబర్‌లో జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, ఎంపీడీఓ రాజ్యలక్ష్మి, ఎంఈఓ, ఎంపీఓ, పీఈటీలతో సమీక్ష నిర్వహించారు. క్రీడాపోటీలు మండలంలోని ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల మైదానంలో నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా ఎంపీపీ అప్పారావు మాట్లాడుతూ.. ఈ పోటీలకు 15నుంచి 36 సంవత్సరాల వయస్సు గల యువతి, యువకులు తమ పేర్లను నమోదు చేసుకోవచ్చన్నారు.

15నుంచి సీఎం కప్–2023 క్రీడలు

ఖానాపురం : మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే సీఎం కప్–2023 క్రీడలను విజయవంతం చేయాలని ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 15, 16, 17 తేదీల్లో మండల స్థాయి క్రీడలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 15నుంచి 36 సంవత్సరాల వయస్సు కలిగిన వారు క్రీడల్లో పాల్గొనాలన్నారు. మండల స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, జిల్లాస్థాయిలో 11రకాల క్రీడలు, రాష్ట్ర స్థాయిలో 18రకాల క్రీడ పోటీలు ఉంటాయని అన్నారు. జిల్లాస్థాయిలో 22నుంచి 24వరకు, రాష్ట్ర స్థాయి పోటీలు 28నుంచి 31వరకు నిర్వహిస్తారన్నారు. మండల స్థాయిలో క్రీడలకు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓ, ఎస్సై, మున్సిపల్ కమిషనర్, పీడీలతో కూడిన కమిటీ ఉంటుందన్నారు. ఖానాపురం మండల స్థాయి క్రీడలు గిరిజన సైనిక్ స్కూల్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. క్రీడాకారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సుమణవాణి, ఎంపీఓ రవి, ఎస్సై తిరుపతి, డీటీ సృజన్‌కుమార్, హెచ్ఎం మంజుల, ఆర్ఐ సత్యనారాయణ, పీటీలు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన



ఈద్గా ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ తదితరులు

సంగెం : మండలంలోని గవిచర్లలో జామ మజీద్ ఈద్గా, ఖబ్రస్తాన్ ప్రహరీ నిర్మాణానికి ఎంపీపీ కళావతి, జెడ్పీటీసీ సుదర్శన్ శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఈద్గా ప్రహరీ కోసం రూ.9లక్షల 90వేలు మంజూరు చేశారన్నారు. సర్పంచ్ దొనికెల రమ, ఎంపీటీసీ గూడ సంపత్‌రెడ్డి, ఉప సర్పంచ్ చెన్నూరి యాకయ్య,మన్సూర్ అలీ, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

'దొంతి మాధవరెడ్డి డ్రామాలు ఆపాలి'



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న నాగెల్లి వెంకటనారాయణగౌడ్ తదితరులు

నర్సంపేట : కుల సంఘం భవనాల నిర్మాణాలపై దొంతి మాధవరెడ్డి డ్రామాలు ఆపాలని నర్సంపేట బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్ అన్నారు. ఈ మేరకు పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటనారాయణగౌడ్ మాట్లాడుతూ.. నాలుగు సంవత్సరాల నుంచి కుల సంఘ భవనాలు పూర్తికాకుండా ఆపింది దొంతి మాధవరెడ్డి కాదా? అని ప్రశ్నించారు. నిర్మాణాలు జరిగితే ఎమ్మెల్యేకు మంచి పేరు వస్తుందనే ఆలోచనతో కోర్టులో కేసులు వేసింది కాంగ్రెస్ నాయకులు కాదా? అని అన్నారు. కోర్టులో కేసు ఉండగానే ఎమ్మెల్యే నిధులు తీసుకువచ్చి టెండర్లు పిలిపించి నిర్మాణాలకు సిద్ధం కావడం జరిగిందన్నారు. మళ్లీ వాటిని అడ్డుకోవడానికి దొంతి మాధవరెడ్డి చోటా మోటా నాయకులతో కోర్టు మెట్లు ఎక్కించే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. గోదాంలు, జిల్లా ఆస్పత్రి, కూరగాయల మార్కెట్ నిర్మాణాలను జరుగకుండా కోర్టు స్టే లు తీసుకువస్తుంది ఎవరో ప్రజలు గమనిస్తున్నారన్నారు. గోదావరి జలాలు తీసుకువస్తే కాళ్లు కడుగుతామని చెప్పిన మీ నాయకుడు ఎక్కడకు పోయాడని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గుంటి కిషన్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మినుముల రాజు, కౌన్సిలర్‌లు దార్ల రమాదేవి, ఎండి.పాషా, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు, బీఆర్ఎస్ పట్టణ కార్యదర్శి వెన్నముద్దల శ్రీధర్‌రెడ్డి, నాయకులు రావుల సతీష్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఇర్ఫాన్, జాగృతి దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్యేతోనే పరకాలకు అన్యాయం'



పరకాల సివిల్ ఆస్పత్రి వద్ద బీజేపీ నాయకులు

పరకాల : అభివృద్ధిలో పరకాల ప్రాంతం వెనకబాటుకు స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డినే కారణమని ఆలేర్ బీజేపీ పాలక్, పరకాల మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి అన్నారు. జిల్లా కేంద్రంతో పాటు పరకాల వైద్యకళాశాల మంజూరు కాకపోవటానికి కూడా చల్లా నిర్లక్ష్యమే అని ఆయన తెలిపారు. శనివారం పరకాల సివిల్ ఆస్పత్రిని మొలుగూరి భిక్షపతితో పాటు బీజేపీ నాయకులు సందర్శించి ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసున్నారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. ములుగు, జయశంకర్‌భూపాలపల్లి జిల్లాలోని 15మండలాలకు పెద్ద దిక్కుగా ఉండే పరకాల సివిల్ ఆస్పత్రి సేవలను గుర్తించి ప్రభుత్వం వైద్యకళాశాల మంజూరు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కానీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి నిర్లక్ష్యం మూలంగానే పరకాలకు అన్యాయం జరిగిందన్నారు. అదే విధంగా 100పడకల ఆస్పత్రికి నిధులు సరిపోవడం లేదని పనులను నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. వచ్చే ఎన్నికలలో కచ్చితంగా బీజేపీ జెండా ఎగురవేయడం ఖాయమన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షుడు మార్త భిక్షపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్, రాష్ట్ర నాయకులు కాచం గురుప్రసాద్, దేవునూరి మేఘనాథ్, కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి, నాయకులు దుబాసి వెంకటస్వామి, గాజుల నిరంజన్, కుక్కల విజయ్‌కుమార్, దండ్రి సురేష్ పాల్గొన్నారు.

మొక్కల సంరక్షణపై దృష్టిసారించాలి



దామెర : గ్రామాల్లో నాటిన మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలని ఎంపీడీఓ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మండలంలోని ల్యాదెళ్ల, పులుకుర్తి, సింగరాజుపల్లి గ్రామాలలో ఆయన పర్యటించి ఎస్సారెస్పీ కెనాల్ బండ్‌పై నాటిన మొక్కలను, నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను, డంపింగ్ యార్డులను శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. ప్రతి మొక్కను కంటికి రెప్పలా కాపాడి, పెంచి పెద్ద చేయాలని అన్నారు. నర్సరీల్లో పెరుగుతున్న హరితహారం మొక్కలకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. ఎంపీడీఓ వెంట సర్పంచ్‌లు, కార్యదర్శులు ఉన్నారు. అనంతరం మండల కేంద్రంలో ఉపాధిహామీ పథకం పనులపై సమీక్ష సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. సమావేశంలో ఏపీఓ శారద, టీఏలు సురేందర్, ప్రిసిల్లా, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.